సాక్షి అనకాపల్లి

మంగళవారం । 17 । అక్టోబర్ । 2023



సేవా జ్యోతి.. సలాం సాహితి

క్రీడల్లో పతకాలు సాధించిన ఉపాధ్యాయిని నాగజ్యోతే కాదు ఆమె కుమార్తె సాహితి కూడా సాహస బాలికగా గుర్తింపు పొందారు. 10లో



బీఐఎస్‌పై వర్క్‌షాప్

విశాఖ: ఏయూలో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ సోమవారం నిర్వహించిన సదస్సును వీసీ ప్రసాదరెడ్డి ప్రారంభించారు.



విద్యార్థులను తీర్చిదిద్దాలి

విశాఖ: ఆధునిక సాంకేతికతకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దాలని యూజీసీ మాజీ చైర్మన్ ఆచార్య వేదప్రకాశ్ అన్నారు.

న్యూస్‌రీల్

ఈవీఎం యంత్రాల తనిఖీ

తుమ్మపాల: జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ కార్యాలయం పక్కన ఈవీఎం గొడౌన్‌లో భెల్ ఇంజినీర్లు సోమవారం ఈవీఎం యంత్రాల మొదటి విడత తనిఖీ చేశారు. 12 మంది భెల్ ఇంజినీర్లతోపాటు జాతీయ, రాష్ట్ర స్థాయి రాజకీయ పార్టీల ప్రతినిధులు సమక్షంలో ఈ తనిఖీలు చేపట్టారు. 4,865 బ్యాలెట్ యూనిట్లు, 3,804 కంట్రోల్ యూనిట్లు, 4,658 వీవీప్యాట్లను పరీక్షించినట్లు డీఆర్వో బి.దయానిధి తెలిపారు.

మహిళ హత్య కేసులో యావజ్జీవ జైలు శిక్ష

విశాఖ లీగల్/గొలుగొండ: వ్యక్తిగత కక్షతో మహిళ హత్యకు కారకుడైన నిందితుడికి యావజ్జీవ జైలు శిక్ష విధిస్తూ విశాఖ నగరంలోని 12వ అదనపు జిల్లా న్యాయమూర్తి గోవర్ధన్ సోమవారం తీర్పు చెప్పారు. జైలు శిక్షతోపాటు రూ.2 వేల జరిమానా చెల్లించాలని, లేని పక్షంలో అదనంగా ఆరు నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ వి. దేవానంద్ వివరాల ప్రకారం... ఉమ్మడి విశాఖ జిల్లా గొలుగొండ మండలం జోగుంపేట గ్రామానికి చెందిన నిందితుడు తెరపల్లి అర్జున (60) గొలుగొండకు చెందిన చెట్ల మహాలక్ష్మిపై కక్ష పెంచుకున్నాడు. తనతో శారీరక సంబంధం కొనసాగించాలని కోరాడు. అందుకు ఆమె నిరాకరించడంతో పలుమార్లు శారీరకంగా, మానసికంగా వేధించేవాడు. ఈ నేపథ్యంలో 2014 జులై మూడో తేదీ తెల్లవారుజాము నాలుగు గంటల సమయంలో లక్ష్మి ఇంటికి వచ్చి తన వెంట తీసుకొచ్చిన స్టీల్ క్యారేజీలో యాసిడ్ ఆమెపై పోశాడు. దాంతో శరీరమంతా కాలిపోయింది. తొలుత స్థానికులు నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తీసుకువెళ్లి, అక్కడి నుంచి విశాఖలోని కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఒక రోజు తర్వాత ఆమె మృతి చెందింది. మృతురాలి కుమారుడు బాబు ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడు అర్జున్‌పై భారతీయ శిక్షాస్మృతి సెక్షన్ 307, 326, 354(ఏ) కింద కేసు నమోదు చేసి నేరాభియోగ పత్రాన్ని దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పునిచ్చారు.

కచ్చిలి చేప @రూ.3.19 లక్షలు



వలలో చిక్కిన ఖరీదైన కచ్చిలి చేప


పాయకరావుపేట: మండలంలోని పెంటకోట గ్రామానికి చెందిన మత్స్యకారుడు చేపల మన్నియ్య పంట పండింది. ఆదివారం రాత్రి ఆయన సముద్రంలోకి బోటు వేసుకుని చేపల వేటకు వెళ్లాడు. 22 కేజీల కచ్చిలి చేప వలకు చిక్కడంతో తబ్బిబ్బయ్యాడు. ఈ చేపను మందుల తయారీకి ఉపయోగిస్తారని, దీన్ని మద్రాసుకు ఎగుమతి చేస్తామని సచివాలయ మండల కన్వీనర్ (జె.సి.యస్.) బొలిశెట్టి శ్రీను తెలిపారు. దీని ధర రూ.3.19 లక్షల వరకు ఉంటుందన్నారు.

ఆర్టీవోగా మనోహర్ బాధ్యతల స్వీకరణ



అనకాపల్లిటౌన్: జిల్లా ఆర్టీవోగా జి.మనోహర్ కొప్పాక ఆర్టీవో కార్యాలయంలో సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గ్రూప్–1 డైరెక్ట్ రిక్రూట్‌మెంట్‌లో ఎంపికయ్యారు. స్వస్థలం సాలూరు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది సహకారంతో త్వరలో జిల్లాలో సమావేశాలు నిర్వహించి, సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఇప్పటి వరకు ఇక్కడ ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వర్తించిన ఆర్టీవో ప్రకాష్ విశాఖలోని తన కార్యాలయానికి వెళ్లిపోయారు.

వాలీబాల్ వరల్డ్ బీచ్ ప్రో-2023 రిఫరీగా భీశెట్టి శ్రీనివాసరావు



అనకాపల్లి టౌన్: పట్టణంలోని గవరపాలేనికి చెందిన భీశెట్టి శ్రీనివాసరావు వాలీబాల్ వరల్డ్ బీచ్ ప్రో–2023 పోటీలకు రిఫరీగా ఎంపికయ్యారు. ఈ మేరకు వాలీబాల్ వరల్డ్ బీచ్ ప్రో చైర్మన్, గోవా ఎమ్మెల్యే జిత్ అరోలకర్ ఉత్తర్వులు జారీ చేశారని సోమవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. గోవాలో ఈ నెల 19 నుంచి 22వ తేదీ వరకు నిర్వహించే ఈ పోటీల్లో 32 దేశాల క్రీడాకారులు పాల్గొంటారన్నారు. మొదటి సారిగా మన దేశంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నారన్నారు. ఈస్టు కోస్టు విశాఖ రైల్వేలో ఆర్పీఎఫ్ ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న తాను గతంలో అంతర్జాతీయ, జాతీయ బీచ్ వాలీబాల్ రిఫరీగా పని చేశానన్నారు.

ఉజ్వల విశాఖి



ఇన్ఫోసిస్ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

- ఐటీ, ఫార్మా కంపెనీలను ప్రారంభించిన సీఎం జగన్
- ఇన్ఫోసిస్ రాకతో బీచ్ ఐటీ కాన్సెప్ట్‌కు కొత్త ఉత్సాహం
- డేటా సెంటర్ డెస్టినేషన్‌గా విశాఖ అభివృద్ధి
- ఫార్మా సెజ్‌లో కంపెనీల విస్తరణతో భారీగా ఉపాధి అవకాశాలు
- విశాఖ నుంచి పరిపాలన సాగిస్తామన్న ముఖ్యమంత్రి
- ఉత్తరాంధ్రకు ఉత్సాహాన్నందించిన ముఖ్యమంత్రి పర్యటన



సీఎంకు జ్ఞాపిక అందిస్తున్న లారస్ కంపెనీ ప్రతినిధులు



బీచ్ క్లీనింగ్ యంత్రాన్ని ప్రారంభిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి

సాక్షి, విశాఖపట్నం: ఉత్తరాంధ్రతో పాటు సరిహద్దు జిల్లాల అభివృద్ధే లక్ష్యంగా.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖ పర్యటన ఆద్యంతం ఉత్సాహంగా సాగింది. పరిపాలనకు ప్రధాన కేంద్రంగా.. భవిష్యత్తులో ఉపాధికి కేంద్ర బిందువుగా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు అడుగులు పడుతున్నాయన్న సీఎం మాటలు.. ఈ ప్రాంత ప్రజలకు ముఖ్యంగా యువత ఆశలకు ఊపిరి పోశాయి. ఐటీ హబ్‌గా విశాఖను అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందన్న విషయం ఇన్ఫోసిస్ ప్రారంభోత్సవంతో మరోసారి నిరూపితమైంది. తొలి విడతలో 1000 మంది ఉద్యోగుల సామర్థ్యంతో ఇన్ఫోసిస్ డేటా సెంటర్ కార్యకలాపాలను ముఖ్యమంత్రి సోమవారం ప్రారంభించారు. ఇదే బాటలో మరికొన్ని సంస్థలు విశాఖ వైపు అడుగులు వేస్తున్నాయని సీఎం ప్రకటనతో విద్యార్థుల్లో నూతనోత్తేజం నెలకొంది.

ఇప్పటికే విప్రో సంస్థ తమ సంస్థ కార్యకలాపాలను 1000 మంది వరకు విస్తరిస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. మిగిలిన కంపెనీలు కూడా బీచ్ ఐటీ డెస్టినేషన్‌కు వస్తే.. ఉత్తరాంధ్ర యువతకు విశాఖ ఐటీ ఎంప్లాయిబిలిటీ డెస్టినేషన్‌గా మారనుంది.

- అలాగే సముద్రతీర ప్రాంత శుభ్రత కోసం జీవీఎంసీ రూ.15 కోట్లతో ఏర్పాటు చేసిన 6 బీచ్ క్లీనింగ్ యంత్రాలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు.

సీఎంవో ఇక్కడి నుంచే..

ఈ ఏడాది చివర్లో విశాఖ నుంచి పరిపాలన సాగిస్తానంటూ సీఎం జగన్ చేసిన ప్రకటనతో ఉత్తరాంధ్ర వాసుల్లో నూతన ఉత్సాహం పెల్లుబికింది. రెండేళ్లలో భోగాపురం అంతర్జాతీయ పౌర విమానాశ్రయం అందుబాటులోకి రాబోతోందని సీఎం ప్రకటించడంతో.. ఉత్తరాంధ్రకు మంచిరోజులు వచ్చాయని ప్రజలంతా హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. పేరుకే భోగాపురం విమానాశ్రయం అయినప్పటికీ.. వైజాగ్ ఎయిర్‌పోర్టుగానే వ్యవహరించనుంది. ఎందుకంటే విశాఖపట్నం నుంచే ఎక్కువగా రాకపోకలు సాగనున్నాయి. దీనికి అనుసంధానంగా గ్రీన్‌ఫీల్డ్ హైవే కూడా రానుండటంతో బీచ్‌రోడ్డుతో పాటు భీమిలి నుంచి భోగాపురం వరకు ఆయా ప్రాంతాలు శరవేగంగా అభివృద్ధి చెందనున్నాయి.



ఇన్ఫోసిస్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి

డిజిటల్ విప్లవానికి నాంది..



ఇన్ఫోసిస్ కార్యాలయంలో మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి

మధురవాడలోని హిల్ నం.4లో డిజిటల్ విప్లవం మొదలుకానుంది. ఇది కేవలం విశాఖకు.. రాష్ట్రానికి.. దేశానికి మాత్రమే కాదు.. యావత్ ఆసియా దేశాలకు పెద్దన్నగా మారనుంది. ప్రముఖ అదానీ సంస్థ ఏర్పాటు చేస్తున్న ఈ డేటా సెంటర్, టెక్నాలజీ బిజినెస్ సెంటర్.. 190 ఎకరాల్లో రూ.20 వేల కోట్లకు పైగా పెట్టుబడులతో నిర్మితమవుతోంది. ఇది కూడా త్వరలోనే అందుబాటులోకి రానుందని సీఎం వైఎస్ జగన్ చెప్పారు. దీంతో పాటు సింగపూర్ నుంచి ప్రత్యేక సబ్‌మెరైన్ కేబుల్ వేస్తున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. సాంకేతికత రాజ్యమేలుతున్న నేపథ్యంలో.. డేటా స్టోరేజ్ పెంచడం, డిజిటలైజేషన్ విస్తరించడం, డేటా వేగం పెరగడం.. ఇలా విభిన్నమైన ప్రయోజనాలు అందించే ఈ ప్రాజెక్టు ద్వారా ఐటీ పరిశ్రమలు విశాఖకు క్యూ కట్టనున్నాయి. ఫలితంగా మరిన్ని ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉత్తరాంధ్ర యువతకు రానున్నాయి.



అచ్యుతాపురం ఫార్మాసిటీలోని లారస్ ల్యాబ్‌లో మందుల తయారీని పరిశీలిస్తున్న సీఎం జగన్

ఫార్మాలో కొలువుల జాతర

మరోవైపు ఫార్మా రంగంలోనూ ఉమ్మడి విశాఖ కీలకంగా మారుతోంది. అచ్యుతాపురం, పరవాడ సెజ్‌లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ఫార్మా కంపెనీల కొత్త యూనిట్ల ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు జరిగాయి. రూ.500 కోట్లతో ఫార్మాసిటీలో 20 ఎకరాల్లో ఏర్పాటైన అరబిందో ఫార్మా అనుబంధ సంస్థ యుజియా స్టెరైల్ యూనిట్ ప్రారంభించడం ద్వారా 750 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. అచ్యుతాపురంలో లారస్ సంస్థ రూ. 440 కోట్లతో నిర్మించిన ఫార్ములేషన్ బ్లాక్‌ను, రూ. 191 కోట్లతో ప్రత్యక్షంగా, పరోక్షంగా 300 మందికి ఉపాధి కల్పిస్తున్న యూనిట్–2ను సీఎం ప్రారంభించారు. అదేవిధంగా రూ. 240 కోట్లతో 450 మందికి ఉపాధి కల్పించే ఉద్దేశంతో పరవాడ వద్ద నిర్మించనున్న యూనిట్–3తో పాటు మరో రూ. 240 కోట్లతో నిర్మించనున్న యూనిట్–7కు సీఎం శంకుస్థాపన చేశారు. ఈ యూనిట్ ద్వారా 450 మందికి ఉపాధి లభించనుంది. మొత్తం రూ.1,611 కోట్లతో ఏర్పాటు చేయనున్న ఈ పరిశ్రమల ద్వారా 2,450 మందికి ఉపాధి లభించనుంది.





పరవాడ ఫార్మాసిటీలోని యుజియా స్టెరైల్ కంపెనీలో డబ్ల్యూఎఫ్ఐ జనరేషన్ సిస్టంను ప్రారంభిస్తున్న సీఎం జగన్, టెక్నీషియన్‌కు ఆత్మీయ పలకరింపు

అభివృద్ధి, సంక్షేమాలను తెలిపేలా..

సామాజిక బస్సు యాత్ర

- వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి



పార్టీ ముఖ్య నాయకులు, ఎమ్మెల్యేలతో సమావేశమైన వైవీ సుబ్బారెడ్డి

సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ నాలుగున్నరేళ్ల పాలనలో అందించిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించడానికి తలపెట్టిన సామాజిక బస్సు యాత్రను విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం ఎండాడ లా కాలేజీ సమీపంలో గల పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 26వ తేదీ నుంచి వచ్చే నెల 9వ తేదీ వరకు ఉత్తరాంధ్ర జిల్లాల్లో తొలి విడత 'సామాజిక బస్సు యాత్ర' ప్రారంభం కానుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో జరిగిన సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ.. గత టీడీపీ ప్రభుత్వంలో జరిగిన అవినీతిని, మేనిఫెస్టోలో హామీలను విస్మరించి ప్రజలను మోసగించిన విధానాన్ని తెలియచెప్పాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, విజయనగరం జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాస్, అల్లూరి జిల్లా అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి, ఎమ్మెల్యేలు అన్నంరెడ్డి అదీప్‌రాజ్, పెట్ల ఉమాశంకర్ గణేష్, గొల్ల బాబూరావు, కన్నబాబురాజు, చెట్టి పాల్గుణ, అప్పలనాయుడు, ఎమ్మెల్సీ రఘురాజు తదితరులు పాల్గొన్నారు.


అగ్రిసెట్ ఫలితాల్లో ర్యాంకుల పంట



మాధురి మల్లిక 6వ ర్యాంక్



సృజన 17వ ర్యాంక్



సాయివరప్రసాద్ 28వ ర్యాంక్

అనకాపల్లి టౌన్: ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఈ నెల 13న విడుదల చేసిన అగ్రిసెట్–2023 పరీక్ష ఫలితాల్లో అనకాపల్లికి చెందిన పాలిటెక్నిక్ ఆఫ్ అగ్రికల్చర్ విద్యార్థులు ర్యాంకుల పంట పండించారు. రాష్ట్రవ్యాప్తంగా 1,884 మంది డిప్లొమా పరీక్షలు రాయగా, స్థానిక పాలిటెక్నిక్ విద్యార్థులు తొలి వందలో 6, 17, 28, 39, 43, 44, 55, 60, 68, 94 ర్యాంక్‌లు సాధించారని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ జగన్నాథరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18 నుంచి 21వ తేదీ వరకు వ్యవసాయ డిగ్రీ (బీఎస్సీ అగ్రికల్చర్) కోర్సులో ప్రవేశానికి వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జోన్లు, కేటగిరీ ప్రాతిపదికన సీట్లు పొందే అవకాశం ఉందన్నారు. ఈ నెలాఖరులో తరగతులు ప్రారంభం కానున్నాయన్నారు.

100 లోపు ర్యాంక్‌లు సాధించిన 10 మంది విద్యార్థులు

విద్యార్థి	మార్కులు	ర్యాంకు
జి.మధు మల్లిక	116మార్కులు	6వ ర్యాంక్
బి.సృజన	114 మార్కులు	17వ ర్యాంక్
బి.సాయివరప్రసాద్	113మార్కులు	28వ ర్యాంక్
ఏ.లీలా సత్యశ్రీ	111మార్కులు	39వ ర్యాంక్
కె.నాగలక్ష్మి	111 మార్కులు	43వ ర్యాంక్
ఎం.దిలీప్	111 మార్కులు	44వ ర్యాంక్
వై.వంశీ	110 మార్కులు	55వ ర్యాంక్
ఎ.జాన్సీ	110 మార్కులు	60వ ర్యాంక్
కె.పద్మ	109 మార్కులు	68వ ర్యాంక్
ఎస్.విజయలక్ష్మి	107 మార్కులు	94వ ర్యాంక్



యుజియా స్టెర్లీ పరిశ్రమ, లారస్ ల్యాబ్ రెండో యూనిట్ ప్రారంభోత్సవానికి వచ్చిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి హెలిపాడ్ వద్ద పుష్పగుచ్ఛం ఇస్తున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు, ప్రభుత్వ విప్ ధర్మశ్రీ, ఎంపీ డాక్టర్ సత్యవతి, డీఐజీ హరికృష్ణ, ఎస్పీ మురళీకృష్ణ, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, జేసీ జాహ్నవి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్

సీఎంకు ఘన స్వాగతం

సాక్షి, అనకాపల్లి: విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో పర్యటన నిమిత్తం విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజా ప్రతినిధులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. సీఎం గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి సోమవారం ఉదయం బయలుదేరి 10.35 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజని, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎంపీలు ఎంవీవీ సత్యనారాయణ, భీశెట్టి వెంకట సత్యవతి, గొడ్డేటి మాధవి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, అధికారులు సీఎం జగన్‌కు స్వాగతం పలికారు. అక్కడ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 11.20 గంటలకు మధురవాడ ఐటీ హిల్స్ నం.3 వద్ద గల హెలిప్యాడ్‌కు, అక్కడ నుంచి రోడ్డు మార్గంలో ఐటీ హిల్ నం.2లోని ఇన్ఫోసిస్‌కు చేరుకున్నారు. అక్కడ రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ఇన్ఫోసిస్ ప్రతినిధులు, పరిశ్రమలు, ఐటీ శాఖ కార్యదర్శి కోన శశిధర్, కలెక్టర్ ఎ.మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, ఇతర ఉన్నతాధికారులు, పారిశ్రామిక వేత్తలు స్వాగతం పలికారు. ఇన్ఫోసిస్ కార్యకలాపాలను సీఎం వైఎస్ జగన్ లాంఛనంగా ప్రారంభించారు. ఇన్ఫోసిస్, వివిధ కంపెనీల ఐటీ అధికారులతో ముఖ్యమంత్రి కాసేపు సంభాషించారు. అక్కడ కార్యక్రమం ముగించుకుని 12.36 గంటలకు బయలుదేరి తిరిగి హెలిప్యాడ్ వద్దకు చేరుకున్నారు. అక్కడ హెలికాప్టర్‌లో బయలుదేరి 1.05 గంటలకు పరవాడలోని హెలిప్యాడ్ వద్దకు చేరుకున్నారు. అక్కడ నుంచి బయలుదేరి ఫార్మా సిటీలోని యుజియా స్టెర్లీ లిమిటెడ్ కంపెనీకి 1.20 గంటలకు చేరుకుని.. ఆ కంపెనీని ప్రారంభించారు. అనంతరం కంపెనీ సీఈవో, డైరెక్టర్‌లతో సమావేశమయ్యారు. అక్కడ నుంచి 2.10 గంటలకు బయలుదేరి హెలిప్యాడ్ వద్దకు చేరుకున్నారు. అక్కడ 2.15కు బయలుదేరి అచ్యుతాపురం సెజ్‌లో హెలిప్యాడ్ వద్దకు 2.25కు చేరుకున్నారు. అక్కడ నుంచి లారస్ ల్యాబ్‌కు చేరుకుని యూనిట్-2ను ప్రారంభించారు.

పరిశ్రమ సందర్శన, అక్కడ కంపెనీ సీఈవో, డైరెక్టర్లు, ఉద్యోగులతో సమావేశమయ్యారు. దాదాపు గంట పాటు లారస్ ఫార్మా కంపెనీలో గడిపారు. అనంతరం 3.25 గంటలకు హెలిప్యాడ్ వద్దకు, 3.50 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. 3.57 గంటలకు గన్నవరానికి విమానంలో బయలుదేరారు.

ముఖ్యమంత్రికి వీడ్కోలు

విశాఖ విమానాశ్రయంలో వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, మేయర్ గొలగాని హరివెంకట కుమారి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, కలెక్టర్ ఎ.మల్లికార్జున, పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తదితరులు ముఖ్యమంత్రికి ఆత్మీయ వీడ్కోలు పలికారు.

సీఎం జగన్‌ను చూసేందుకు ఎగబడ్డ లారస్ ఉద్యోగులు

అచ్యుతాపురం (అనకాపల్లి): అచ్యుతాపురం సెజ్‌లోని లారస్ యూనిట్ ప్రారంభోత్సవానికి విచ్చేసిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డితో సెల్ఫీలు దిగేందుకు ఆ కర్మాగార ఉద్యోగులు పోటీపడ్డారు. సోమవారం అచ్యుతాపురం సెజ్‌కు విచ్చేసిన సీఎం జగన్‌ను పలకరించేందుకు ఉద్యోగులు పోటీపడ్డారు. కార్యక్రమం ముగిసిన తర్వాత వెళ్లిపోతున్న సందర్భంలో జగన్‌మోహన్‌రెడ్డి ఉద్యోగుల వద్దకు వెళ్లి ఆప్యాయంగా పలకరించారు. ఆ తర్వాత అక్కడి ఉద్యోగులతో ఫోటో దిగారు. మరికొందరు సీఎంతో సెల్ఫీలు తీసుకునేందుకు ముందుకు వచ్చారు. సెక్యూరిటీ సిబ్బంది వారించేందుకు ప్రయత్నించగా, సీఎం నవ్వుతూ వారందరినీ పలకించారు. దీంతో ఉద్యోగులు సంతోషం వ్యక్తం చేశారు.

కొత్తవీధిలో విజిలెన్స్ బృందం

మాడుగుల రూరల్ : చీడికాడ మండలం, కోనాం గ్రామ పంచాయితీ శివారు కొత్తవీధి గ్రామాన్ని జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు సోమవారం సందర్శించారు. కొత్తవీధి కోందు ఆదివాసీలు, గుంటి గ్రామం కొండ ఆదివాసీల నుంచి ఈ సభ్యులు వివరాలు సేకరించారు. కొత్తవీధి గ్రామానికి చెందిన వంతల నాగేశ్వరావు, గెమ్మిలి బాలరాజు కమిటీ సభ్యులకు వివరాలు తెలియజేస్తూ తాము ముప్పై ఏళ్లగా సర్వే నంబరు 289 లో గ్రామాన్ని నిర్మించుకుని జీవిస్తున్నామని, గ్రామం చుట్టూ వున్న భూములు సాగులోకి తీసుకోచ్చామని తెలిపారు. తమ గ్రామానికి విద్యుత్ సదుపాయం ఉందని, తమకు ఓటరు, ఆధార్, కార్డులు వున్నా స్థానిక రెవెన్యూ అధికారులు ఈ విషయాన్ని నిర్ధారించడానికి నిరాకరిస్తున్నారని ఆరోపించారు. కమిటీ సభ్యులు ఆదివాసీలు పెంచిన జీడి మామిడి తోటలు, ఇతర వృక్షాలను పరిశీలించారు. గత ప్రభుత్వంలో మంజూరై మధ్యలో నిలిచిపోయిన అసంపూర్తి గృహాలను కూడా పరిశీలించారు. వీరి వెంట వున్న ఆఖిల భారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం జాతీయ కార్యదర్శి పి.ఎస్.అజయ్‌కుమార్ మాట్లాడుతూ గత ఏడాది ఆగస్టులో భూమి శిస్తు కమిషనర్ ఇక్కడ జరిగిన భూ కుంభకోణంపై విచారణ చేసి నివేదిక ఇవ్వాలని కోరారని, గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఇచ్చిన ఆదేశాలపై, గిరిజన సంక్షేమ డైరెక్టరు ఇక్కడ ఆదివాసీలకు జరుగుతున్న అన్యాయంపై విచారణ జరిపి, సమగ్ర నివేదిక ఇవ్వమని రెండుసార్లు ఉత్తర్వులు ఇచ్చారని, కానీ వాటిపై స్పందన లేదని అజయ్‌కుమార్ అన్నారు. కాగా తాము ఇక్కడ పరిశీలించిన అంశాలపై జిల్లా కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామని కమిటీ సభ్యుడు అప్పలరాజు తెలిపారు. సమస్యల పరిష్కారానికి తాము కృషి చేస్తామని హామీ ఇచ్చారు.



కోనాం శివారు కొత్తవీధి గ్రామస్తులతో మాట్లాడుతున్న జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ సభ్యులు

క్లుప్తంగా

ఎస్పీ స్పందనకు 14 అర్జీలు

అనకాపల్లిటౌన్ : ఎస్పీ కార్యాలయంలో సోమవారం స్పందనకి 14 అర్జీలు వచ్చినట్టు జిల్లా క్రైం రికార్డు బ్యూరో ఇన్‌స్పెక్టర్ ఎస్.లక్ష్మణ మూర్తి చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్తి తగాదాలు, కుటుంబ సమస్యలపై 14 అర్జీలు వచ్చినట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఖోఖో పోటీలు



శ్రీ ప్రకాష్ రెసిడెన్షియల్ హైస్కూల్, శ్రీ ప్రకాష్ విద్యానికేతన్ జట్ల మధ్య పోటీ

పాయకరావుపేట : శ్రీ ప్రకాష్‌లో జరుగుతున్న సీబీఎస్ఈ క్లస్టర్ -7 ఖో ఖో పోటీల్లో సుమారు 100 జట్లు, 1200 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారు. ఈ పోటీలు క్వార్టర్ ఫైనల్స్ దశకు చేరుకున్నాయి. 17వ తేదీన ఫైనల్స్ పోటీలు జరుగుతాయని, విజేతలకు బహుమతి ప్రదానం జరుగుతుందని విద్యా సంస్థల సీనియర్ ప్రిన్సిపాల్ ఎం.వి.వి.ఎస్ మూర్తి తెలిపారు. ముగింపు కార్యక్రమానికి అనకాపల్లి జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ ముఖ్య అతిధిగా హాజరవుతారని ఆయన తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

కశింకోట : కశింకోట నుంచి అనకాపల్లి వైపు వెళ్లే మార్గంలో ఆర్టీసీ బస్టాండ్ వద్ద జాతీయ రహదారిపై 40 ఏళ్ల వయసు గల గుర్తు తెలియని వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొని వెళ్లిపోయింది. మృతదేహం గుర్తు పట్టడానికి వీలులేని విధంగా నుజ్జయిందని ఎస్ఐ ఎ.ఆదినారాయణరెడ్డి తెలిపారు. మృతుడు నలుపు రంగు ఫుల్ హేండ్స్ షర్టు, నీలం రంగు జీన్ ప్యాంటు ధరించి ఉన్నాడని, మృతుని వివరాలు తెలిస్తే తమను సంప్రదించాలని ఎస్ఐ కోరారు.

సహకార రంగ పరిరక్షణకు రాష్ట్ర సదస్సు రేపు

కశింకోట: అధిక శాతం రైతాంగం రుణాల కోసం ఆధారపడే సహకార రంగాన్ని కాపాడుకునేందుకు ఈ నెల 18న అనకాపల్లిలో నిర్వహించనున్న రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కర్రి అప్పారావు, సీపీఎం సీనియర్ జిల్లా నాయకుడు జి.నాయనబాబు కోరారు. ఈ మేరకు సోమవారం కశింకోటలోని సంతలో కరపత్రాలు పంపిణీ చేసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల ఆస్తులతో నిర్మితమైన ప్రభుత్వ రంగ సంస్థలతో పాటు సహకార రంగాన్ని కార్పొరేట్లకు అప్పగించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. కేరళ రాష్ట్రంలో సహకార రంగాన్ని ప్రజా ఉద్యమంలా నడిపిస్తున్నారని పేర్కొన్నారు. అదే విధంగా రాష్ట్రంలో కూడా సహకార రంగాన్ని యధావిధిగా కొనసాగించాల్సి ఉందన్నారు. సహకార రంగ పరిరక్షణకై అనకాపల్లిలో జరిగే సదస్సుకు రైతులు, ప్రజా సంఘాలు హాజరై, మద్దతుగా నిలవాలని కోరారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు అప్పారావు

అలరించిన 'మాయా బజార్'



మాయా బజార్ నాటికలో ఓ సన్నివేశం

అనకాపల్లిటౌన్: దసరా ఉత్సవాల్లో భాగంగా గవరపాలెం వీవీ రమణ రైతు భారతి హాల్లో సోమవారం రాత్రి సురభి వారిచే ప్రదర్శించిన మాయా బజార్ నాటిక ప్రేక్షకుల్ని సమ్మోహితుల్ని చేసింది. వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ జ్యోతి ప్రజ్వలన చేసి, నాటికను ప్రారంభించారు. ప్రస్తుత ఆధునిక సాంకేతిక యుగానికి అనువుగా సినీ సెట్టింగ్‌లతో ప్రతి సన్నివేశం అబ్బురపరిచేలా చేసింది. కళ్ల ముందే ఘటోత్కచుడు మాయమవడం,అభిమన్యుడి ధనుర్విన్యాసం ప్రేక్షకుల్ని ఆకట్టుకుంది. ప్రారంభోత్సవంలో కామాక్షిదేవి ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న నాటికోత్సవాలు

అనకాపల్లిటౌన్ : గవరపాలెం సతకంపట్టు శ్రీ కనక దుర్గ అమ్మవారి దసరా నవరాత్రి మహోత్సవాలు పురస్కరించుకుని గౌరీ సేవాసంఘం మళ్ల జగన్నాథం కల్యాణమండపలంలో కర్రి రమేష్ మెమోరియల్ ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటికోత్సవ పోటీలు రెండోరోజు సోమవారం జరిగాయి. నాటిక పోటీలను వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటికలు మనస్సు ప్రశాంతతకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన నాటికలు ఆకట్టుకున్నాయి.

ఇది రైతు 'కన్నీటి కథ..'

హైదరాబాద్ మిత్ర క్రియేషన్స్ వారు ప్రదర్శించిన కన్నీటి కథ నాటిక అందరినీ ఆకట్టుకుంది. నీరు అంటే-ఒక నాగరికత, ఒక అస్తిత్వం, ఒక జీవన విధానం...ఒకానొక గ్రామంలో బహుళజాతి కంపెనీపెట్టి రంగునీళ్ల కంపెనీ అక్కడ బతుకు చిత్తరువును చిదిమేసింది. రైతు సాగునీటిని, తాగునీటిని కోల్పోయాడు. అప్పుల పాలయ్యాడు. 600 అడుగుల లోతున బోరు దించినా చుక్కనీరు లేదు. ఆ రైతు చుట్టూ ఉన్నజీవితాల గాథే ఈ 'కన్నీటి కథ'. కేరళ రాష్ట్రంలోని పాల్‌కాడ్ జిల్లాలో జరిగిన యదార్థ సంఘటనకు ఈ నాటిక మూలం. రచన-శిష్టా చంద్రశేఖర్, దర్శకత్వం-ఎస్.ఎం. బాషా నిర్వహించారు.



కన్నీటి కథ నాటిక ప్రదర్శన

బావా ఎప్పుడు వచ్చితీవు....

భీమవరం ఓంప్రద క్రియేషన్స్ ప్రదర్శించిన 'బావా ఎప్పుడు వచ్చితీవు' నాటిక కూడా అలరించింది. పెళ్లి చేసుకుని కొత్తగా కాపురం పెట్టిన సుబ్బారావు భార్య పల్లెటూరు నుంచి వచ్చింది కనుక తనకు లోకం పోకడ ఏమీ తెలియదనుకుంటాడు. భార్యతో.. ఎవరిని ఎలా పిలవాలో, ఎలా మర్యాద చేయాలో చెబుతూ భర్త అనే అహంకారాన్ని వెలిబుచ్చుతూ ఉంటాడు. చిన్నప్పుడే రామాయణ, మహాభారతాలు చదివిన ఆ అమ్మాయి భర్తకు బుద్ధి చెప్పడం 'బాబా ఎప్పుడు వచ్చితీవు' నాటిక సారాంశం. రచన భవాని ప్రసాద్. దర్శకత్వం భీశెట్టి జ్యోతిరాజ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు రమణ, చైర్మన్ కర్రి సన్యాసినాయుడు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షకు సమీర్ శర్మ రాక నేడు

కశింకోట: మండలంలోని కొత్తపల్లిలో మంగళవారం జరగనున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారు సమీర్ శర్మ సందర్శించనున్నారు. ఈ నేపథ్యంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో కె.వి.జ్యోతి ఏర్పాట్లను పరిశీలించారు. అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. కలెక్టర్ రవి పట్టానిశెట్టి వెబెక్స్ కాన్ఫరెన్స్ నిర్వహించి పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులు, సిబ్బందికి సూచించారు. మండల ప్రత్యేక అధికారి రోజా రాణి, జిల్లా ప్రోగ్రాం అధికారి జగదీష్, ఎంపీడీవో వి.వి.రవికుమార్, వైద్యులు యు.రమేష్, ఎస్.తిరుపతిరావు, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

యోగాలో తుమ్మపాల గ్రామస్తుల ప్రతిభ



రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో ప్రతిభ చూపిన తుమ్మపాల గ్రామస్తులు

అనకాపల్లి రూరల్ : రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో మండలంలోని తుమ్మపాలకు చెందిన నలుగురు ప్రతిభ కనబరిచారు. 52 నుంచి 60 సంవత్సరాల విభాగంలో బుదిరెడ్డి నర్సింగరావు ద్వితీయ స్థానం, ముదిరెడ్డి నాగమణి ఆరో స్థానం, మార్టూరు లక్ష్మి 9వ స్థానం, 8 నుంచి 14 ఏళ్ల విభాగంలో పెద్దాడ వర్షిణి ఏడో స్థానంలో నిలిచారు. వీరిలో ద్వితీయ స్థానంలో నిలిచిన బుదిరెడ్డి నర్సింగరావు వచ్చే డిసెంబరు నెలలో కోల్‌కతాలో జరిగే జాతీయ యోగా పోటీలకు ఎంపికయ్యారు. వీరిని గ్రామ పెద్దలు, యోగా టీచర్లు అభినందించారు.

మున్సిపల్ ఉద్యోగుల సంఘం కార్యదర్శిగా నీలిమ

యలమంచిలి : రాష్ట్ర మున్సిపల్ ఉద్యోగుల మినిస్టీరియల్ కార్యవర్గ ఎన్నికల్లో యలమంచిలి మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఇద్దరు ఉద్యోగులు కీలక పదవులు పొందారు. ఆదివారం రాష్ట్ర మున్సిపల్ మినిస్టీరియల్ ఉద్యోగుల కార్యవర్గ ఎన్నికలు భీమవరంలో జరిగాయి. ఈ ఎన్నికల్లో యలమంచిలి మున్సిపాలిటీలో రెవెన్యూ విభాగంలో ఆర్వోగా పనిచేస్తున్న జి.నీలిమ రాష్ట్ర మున్సిపాలిటీ మహిళా మినిస్టీరియల్ ఉద్యోగుల సెక్రటరీగా, ఇక్కడ రెవెన్యూలో పనిచేస్తున్న టి.గోవింద్ జాయింట్ సెక్రటరీగా పదవులు పొందారు. వీరిని సోమవారం యలమంచిలి మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ కె.కొండలరావు, మున్సిపల్ ఉద్యోగులు అభినందించారు.



మున్సిపల్ ఆర్వో నీలిమను సన్మానిస్తున్న మున్సిపల్ ఉద్యోగులు

సేవా 'జ్యోతి'.. సలాం సాహితి

- బోధనలో, క్రీడల్లో, సేవల్లోనూ ఆదర్శంగా నాగజ్యోతి
- తల్లికి తగ్గ తనయగా సాహస బాలిక సాహితి
- విశిష్ట సేవలతో తల్లీకుమార్తెకు జాతీయ, అంతర్జాతీయ గుర్తింపు

ఆమె ఒక ఉపాధ్యాయిని.. క్రీడాకారిణి, సేవామూర్తి. ఆమె కుమార్తె విద్యాభ్యాసంలోనూ, క్రీడల్లోనూ తల్లికి తగ్గ తనయ..ఈతలో ప్రవీణ్యత ఆమె సొంతం ...ధైర్య సాహసాలతో రాష్ట్రపతి అవార్డు సొంతం చేసుకున్న సాహస బాలిక కూడా..జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎన్నెన్నో పతకాలు సాధించి జిల్లాకు వన్నె తెచ్చారు.



స్విమ్మింగ్‌లో నీటిపై అద్భుతం చేస్తోన్న సాహితి

రావికమతం : కొత్తకోట గ్రామానికి చెందిన టీచర్ పి.వి.ఎం.నాగజ్యోతి ఎమ్మెస్సీ ఎంపీఈడీ చేశారు. రావికమతం మండలంలోని కన్నంపేట స్కూల్లో పనిచేసి ఇటీవల రోలుగుంట హైస్కూల్‌కు బదిలీ అయ్యారు. బోధనలో ఎన్నెన్నో మెళకువలు నేర్చుకున్నారు. సర్టిఫికెట్ కోర్స్ ఇన్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచింగ్ కోర్స్‌కు రాష్ట్రం నుంచి ఎంపికై బెంగళూరులో శిక్షణ పొందారు. ఉత్తమ బోధనతో పాటు తన సొంత ఖర్చుతో పది మందికి సేవ చేస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. విద్యా బోధనలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయినిగా జిల్లా కలెక్టర్ రవిపటాన్‌శెట్టి, అనకాపల్లి ఎంపీ భీశెట్టి సత్యవతి చేతుల మీదుగా అవార్డు స్వీకరించారు. నెల నెలా తనకొచ్చే జీతంలో కొంత మొత్తం వెచ్చించి సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. కొత్తకోట గ్రంథాలయానికి రూ.20 వేల విలువైన పుస్తకాలు అందించారు. పేద విద్యార్థులకు పలుమార్లు దుస్తులు, స్టడీ మెటీరియల్ అందించారు. కరోనా సమయంలో ఎన్నో కుటుంబాలు, పోలీసులకు, ఆరోగ్య సిబ్బందికి పలు సహాయాలను అందించి అందరి మన్ననలు పొందారు. ఆమె అందిస్తున్న సేవలకు వాసవీ క్లబ్, రాష్ట్ర నాయకులు, అధికారుల చేతుల మీదుగా ఎన్నో సన్మానాలు పొందారు. ఉపాధ్యాయినిగానే కాదు క్రీడల్లోనూ ప్రతిభ చూపి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించి ఔరా అనిపిస్తున్నారు.

నేపాల్‌లో ఈ నెల 5 నుంచి 10 వరకూ జరిగిన అంతర్జాతీయ పోటీల్లో నాలుగు పతకాలు సాధించి భారత పతాకాన్ని రెపరెపలాడించారు. పవర్ లిఫ్టింగ్, రన్నింగ్ పోటీల్లో బంగారు పతకాలు, డిస్కస్ త్రో, జావలిన్ త్రోలో రజత పతకాలు సాధించారు. గతంలో పలుమార్లు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో బంగారు పతకాలు సాధించారు. నాగజ్యోతి భర్త సర్వేశ్వరరావు మెడికల్ ఏజెంట్‌గా పనిచేస్తుంటారు.



కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి, ఎంపీ సత్యవతి చేతుల మీదుగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు స్వీకరిస్తున్న నాగజ్యోతి

తల్లికి తగ్గ తనయ సాహితి

నాగజ్యోతి కుమార్తె సాహితి విద్యాభ్యాసంలో మంచి ప్రతిభ చూపుతోంది. దువ్వాడ విజ్ఞాన్ కళాశాలలో బీటెక్ సెకండియర్ చదువుతున్న సాహితి చిన్ననాటి నుంచి మెరిట్ స్టూడెంట్. చిన్ననాటి నుంచి ఈతపై కూడా ఆమెకు మక్కువ. అనకాపల్లి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలోనూ, అనకాపల్లి అబ్దుల్ కలాం ఆర్గనైజేషన్ నిర్వహించిన జిల్లా స్థాయి పోటీలో పలుమార్లు విజేతగా నిలిచింది. బంగారు పతకాలు సాధించింది. నీటిపై తేలుతూ ఎన్నో విన్యాసాలను, యోగాసనాలను సాహితి అవలీలగా వేస్తోంది.

సాహస బాలిక..

నాలుగేళ్ల క్రితం పూడిమడక సముద్రతీరానికి వెళ్లిన సాహితి అక్కడ పెద్ద సాహసమే చేసింది. సముద్రంలో ప్రమాదవశాత్తూ అలల్లో చిక్కుకున్న ఇద్దరు బాలురను కాపాడి సాహస బాలికగా గుర్తింపు తెచ్చుకుంది. జాతీయ ఉత్తమ జీవన్ రక్ష ప్రెసిడెంట్ అవార్డు పొందింది. దేశంలో 8 రాష్ట్రాలకు చెందిన 8 మంది సాహస బాలికలను ఈ అవార్డుకు ఎంపిక చేయగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి సాహితిని భారత ప్రభుత్వం ఎంపిక చేసింది. 2022 జనవరి 26 రిపబ్లిక్ డే సందర్భంగా అప్పటి రాష్ట్రపతి రామనాథ్ కోవింద్ చేతుల మీదుగా వర్చువల్ పద్ధతిలో ఈ అవార్డును స్వీకరించింది. అవార్డుతో పాటు రూ.60వేల నగదు బహుమతి, మెడల్, షీల్డ్ స్వీకరించింది. దీనిని గుర్తిస్తూ సాహితికి లైఫ్‌సేవింగ్ యాక్టు ప్రకారం స్పెషల్ మెరిట్ సర్టిఫికెట్‌ను సైతం అప్పటి విశాఖ కలెక్టర్ మల్లికార్జున చేతుల మీదుగా అవార్డును సాహితి అందుకుంది. కుగ్రామంలో జీవిస్తూ విశిష్ట సేవలతో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎంతో గుర్తింపు తెచ్చిన తల్లీకూతుళ్లు పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.



విశాఖ పోలీసు కమిషనర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో స్పెషల్ మెరిట్ అవార్డు అందుకుంటున్న సాహితి



భర్త సర్వేశ్వరరావు, కుమార్తె సాహితితో నాగజ్యోతి

క్లుప్తంగా

నేడు 'జగనన్న ఆరోగ్య సురక్ష'

అనకాపల్లిటౌన్: స్థానిక పట్టణ పరిధిలో గొల్లవీధి యూపీహెచ్‌సీలో మంగళవారం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం వరకూ జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు జోనల్ కమిషనర్ సుర వెంకటరమణ సోమవారం ఒక ప్రకటనలో అన్నారు. గతంలో రక్తపరీక్షలు చేయించుకుని, టోకెన్లు పొందిన వారితోపాటు స్పాట్ రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారు కూడా వైద్యసేవలు పొందవచ్చన్నారు. వైద్యశిబిరానికి నలుగురు స్పెషలిస్టు వైద్యులు హాజరై, రోగులను పరీక్షించి, ఉచితంగా మందులు అందిస్తారని పేర్కొన్నారు. పెద్దపెద్ద ఆపరేషన్లకు ఎంపికైన రోగులను ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ ఆస్పత్రిలో చేర్పించి, ఉచితంగా చికిత్స చేయనున్నట్లు తెలిపారు. కంటిచూపు సమస్యలున్న వారికి ప్రత్యేకంగా కంటిపరీక్షలు నిర్వహించి, కళ్లద్దాలు, శస్త్రచికిత్సలకు సిఫార్సు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ అవకాశాన్ని యూపీహెచ్‌సీ పరిధిలోని ప్రజలంతా సద్వినియోగపర్చుకోవాలని కోరారు.

కశింకోట: మండలంలోని కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం జరగనుందని ఎంపీపీ కలగా లక్ష్మి, ఎంపీడీవో వి.వి.రవికుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక వైద్యులు, పీహెచ్‌సీ వైద్యులు హాజరై పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తారని పేర్కొన్నారు. కొత్తపల్లి సచివాలయంతోపాటు దీని పరిధిలోని బుచ్చియ్యపేట గ్రామానికి చెందిన ప్రజలు శిబిరానికి హాజరై వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అవగాహనతోనే బాల్య వివాహాల నియంత్రణ



బాల్య వివాహాల నిర్మూలన ర్యాలీలో పాల్గొన్న సచివాలయ సిబ్బంది

కశింకోట: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరుతూ సోమవారం కశింకోటలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు, స్థానిక పంచాయతీ ప్రధాన రహదారిపై ప్రదర్శన జరిపారు. బాల్య వివాహాలు నివారించి బాల్య వివాహ రహిత భారత దేశం కోసం ప్రతి ఒక్కరూ దోహదపడాలన్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎస్.రమేష్, సచివాలయ కార్యదర్శులు, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు సోమవారం 1947 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,340	4,500
రెండో రకం	3,960	4,290
మూడోరకం	3,720	3,900

అనకాపల్లి సినిమాలు

మ్యాడ్	:రాజా
స్కంద	:సత్యనారాయణస్క్రీన్-1
చిన్నా	:సత్యనారాయణస్క్రీన్-2
మామా మశ్చీంద్ర	: షిర్డిసాయి
రూల్స్ రంజన్	:పర్తిసాయి
ది ఎక్సార్సిస్ట్: బిలీవర్	: వెంకటేశ్వర
800	: శ్రీసత్య
చంద్రముఖి-2	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 54 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-20 యూనిట్లు, బీ పాజిటివ్-16 యూనిట్లు, ఓ పాజిటివ్-13 యూనిట్లు, ఓ నెగిటివ్-2 యూనిట్లు, ఏబీ పాజిటివ్-3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి యు.లోకేష్(9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 421 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 396 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.



గవరపాలెం నూకాంబిక బాలాలయంలో రుద్రాభిషేకం చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు



వేల్పులవీధిలో ఏర్పాటు చేసిన అమ్మవారు




బాలా త్రిపుర సుందరిగా సతకంపట్టు కనకదుర్గమ్మ



సరస్వతీదేవిగా గౌరీ పంచాయతన కనకదుర్గమ్మ



సరస్వతిదేవి అలంకరణలో కన్యకాపరమేశ్వరి



తాకాశీవీధి నూకాంబికకు కరెన్సీ నోట్లతో అలంకరణ

బాలాత్రిపురసుందరీం.. సర్వతత్వాత్మకాం

- గాయత్రి, సరస్వతి, బాలాత్రిపురసుందరి అలంకరణలో అమ్మవారు
- ఊరూవాడా అమ్మవారి శరణు ఘోష, అన్న సమారాధనలు

మనసు, బుద్ధి, చిత్తం, అహంకారాలను తన అధీనంలో ఉంచుకున్న శక్తి.. బాలా త్రిపుర సుందరీదేవి. శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా ఊరూ వాడా వెలసిన అమ్మవారి దేవాలయాల్లో దుర్గమ్మను కొన్ని చోట్ల బాలా త్రిపుర సుందరిగాను, మరికొన్ని చోట్ల గాయత్రి, సరస్వతీదేవి అవతారంలో అలంకరించి, భక్తులు పూజలు చేశారు. దసరా ఉత్సవాల్లో రెండో రోజైన సోమవారం ఊరూవాడా అమ్మవారి నామస్మరణతో మార్మోగిపోయింది.

అనకాపల్లిటౌన్: పట్టణం, మండలంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో రెండో రోజైన సోమవారం ఘనంగా పూజలు నిర్వహించారు. తెల్లవారు జాము నుంచే అమ్మవారి దేవాలయాలు, మండపాలు భక్తుల దేవీ నామస్మరణతో మార్మోగాయి. మహిళలు, భవానీ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కుంకుమ పూజలు చేశారు.

నూకాంబిక బాలాలయంలో విశేష పూజలు
ఉత్తరాంధ్ర ఇలవేల్పు అనకాపల్లి నూకాంబిక అమ్మవారి బాలాలయంలో గణపతి పూజ, కుంకుమ పూజలు నిర్వహించారు. ఉదయం రుద్రాభిషేకం, సాయంత్రం దీపాలకరణ సేవ చేపట్టారు. అన్నసమారాధన కార్యక్రమాన్ని ఆలయ ధర్మకర్త అడారి ఉమాశ్రీనివాసరావు దంపతులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, ఈవో బండారు ప్రసాద్, ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

బాలా త్రిపుర సుందరిగా సతకంపట్టు కనకదుర్గమ్మ
స్థానిక గవరపాలెం సతకంపట్టు కనకదుర్గమ్మవారు బాలా త్రిపుర సుందరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు భోగారపు వెంకటరమణ ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమ పూజలు, హోమాలు నిర్వహించారు. ఉదయగిరి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో అమ్మవారికి అవతారాల అలంకరణ చేశారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ దంపతుల ఆర్థిక సాయంతో భవానీ మాలాధారణ భక్తులకు అన్నసమారాధన జరిపారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు పీవీ రమణ, చైర్మన్ కర్రి సన్యాసినాయుడు, ఆలయ నిర్వాహకులు కాండ్రేగుల నాయుడు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తి రథయాత్రను పర్యవేక్షకులు పొలిమేర శ్రీనివాసరావు నేతృత్వంలో పురవీధుల గుండా ఊరేగించారు.

సరస్వతీదేవిగా గౌరీపంచాయతన అమ్మవారు
గవరపాలెం గౌరీపంచాయతన దేవాలయంలో గౌరీదేవి సోమవారం భక్తులకు సరస్వతిదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ప్రధాన అర్చకులు అంపోలు గోపాలకృష్ణశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు చేశారు. సాయంత్రం 5గంటలకు 10 సంవత్సరాలలోపు చిన్నారులచే సామూహిక సరస్వతీదేవి పూజలు చేపట్టారు. పిల్లలకు పూజలో ఉంచిన పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దేవాలయ అధ్యక్షుడు బొడ్డేడ సన్యాసినాయుడు, కార్యదర్శి బుద్ధ రమణాజీ, కోశాధికారి కర్రి శివసూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



గౌరీపంచాయతన ఆలయంలో సరస్వతీ పూజలో పాల్గొన్న చిన్నారులు

గాయత్రీదేవి అవతారంలో కామాక్షిదేవి
గవరపాలెం నిదానందొడ్డిలో వేంచేసిన కామాక్షమ్మ ఆలయంలో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని అలంకరించి ఆలయ మండపంలో ప్రత్యేక పూజలు చేశారు. కామాక్షమ్మ భక్తులకు గాయత్రీదేవిగా దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ కోటిపల్లి శ్రీను, విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు మత్తుర్తి గంగారావు, వైస్ చైర్మన్ శొంఠ్యాణ సతీష్, కోశాధికారి తణుకు రవి తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీదేవిగా కన్యకాపరమేశ్వరి
స్థానిక మెయిన్‌రోడ్డు కన్యకాపరమేశ్వరి దేవాలయంలో అమ్మవారు సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం సరస్వతీ పూజ జరిపారు. స్థానిక చిన్నవీధి జార్జి స్కూల్లో 102 మంది విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు తదితర స్టేషనరీ సామగ్రి అందించారు. సాయంత్రం అనకాపల్లి శ్రీ ఉమామహేశ్వర మ్యూజిక్ అండ్ కూచిపూడి అర్ట్స్ అకాడమీ వారిచే కూచిపూడి, జానపద నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్, కార్యదర్శి కొరుపోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు, భక్తులు పాల్గొన్నారు.

తాకాశీవీధిలో కరెన్సీ నోట్లతో అలంకరణ
శరన్నవరాత్రిని పురస్కరించుకుని తాకాశీవీధిలో నూకాంబిక అమ్మవారిని ఆలయ చైర్మన్ తాకాశి సత్యందొర ఆధ్వర్యంలో కరెన్సీనోట్లతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు.
– వేల్పులవీధిలో జై దుర్గా జైజైదుర్గా ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కనకదుర్గ అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు.

కశింకోట: మండలంలోని బయ్యవరంలో జాతీయ రహదారి పక్కన సెట్టింగ్ వేసి నెలకొల్పిన పర్యావరణ హిత కనక దుర్గమ్మ విగ్రహం ఆహూతులను విశేషంగా ఆకట్టుకుంటోంది. శరన్నవరాత్రి ఉత్సవాలు పురస్కరించుకుని దుర్గాదేవి విగ్రహాన్ని నెలకొల్పారు. విగ్రహం చుట్టూ, బయట కుండీల్లో వివిధ రకాల మొక్కలను చూడముచ్చటగా అలంకరించారు. ప్రవేశ మార్గంలో కాళికామాత విగ్రహాన్ని నిలిపి, కర్రలతో అందంగా గుడి కట్టి శిఖరంలో శివలింగాన్ని ఏర్పాటు చేశారు. అమ్మ వారికి రోజూ ఉదయం, సాయంత్రం పూజలు నిర్వహిస్తున్నారు. కశింకోటలోని గవరపేట మధ్యవీధిలో సెట్టింగ్‌ల మధ్య ఏర్పాటు చేసిన దుర్గాదేవి విగ్రహం వద్ద స్థానికులు, భవానీ భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై పూజలు నిర్వహించారు.



గాయత్రీదేవి అలంకరణలో కామాక్షిదేవి



కశింకోటలోని గవరపేట మధ్యవీధి మండపంలో కొలువుదీరిన దుర్గాదేవి



పర్యావరణ హిత మండపంలో ఏర్పాటైన అమ్మవారు

సాదర స్వాగతం



అచ్యుతాపురం సెజ్‌లో ఉన్న లారస్ ల్యాబ్‌లో రెండో యూనిట్ ప్రారంభోత్సవానికి వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని హెలిపాడ్ వద్ద ఏపీ ఇన్‌లాండ్ వాటర్‌వేస్ అథారిటీ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్ కలిసి, పుష్ప గుచ్ఛం అందించి, సాదర స్వాగతం పలికారు.
- సాక్షి, అనకాపల్లి

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

అనకాపల్లి రూరల్: మండలంలోని దిబ్బపాలెం అంగన్‌వాడీ కేంద్రం-2ను ఎంపీపీ గొర్లి సూరిబాబు సోమవారం తనిఖీ చేశారు. కేంద్రంలో విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారా? లేదా? అని ఆరా తీశారు. చిన్నారుల విద్యా ప్రమాణాలను పరిశీలించారు. నిర్వాహకురాలికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో దిబ్బపాలెం ఎంపీటీసీ పెద్దాడ అచ్చియ్యమ్మ, పెద్దాడ రాంశంకర్, సర్పంచ్ పీలా ఉషా అప్పారావు, ఉప సర్పంచ్ గండ్రెడ్డి దేవీకృష్ణ, వార్డు సభ్యుడు మట్టా గణేష్, సచివాలయం కన్వీనర్ సూరిశెట్టి కృష్ణ, పెంటకోట రామకోటి, విల్లూరి సత్యనారాయణ, విరోతి సత్తిబాబు పాల్గొన్నారు.

మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ

తుమ్మపాల: ప్రజలకు చేతనైనంత సాయం చేయడమే దైవ సేవ అని వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు దాడి రత్నాకర్ అన్నారు. పాస్టర్స్ డే పురస్కరించుకుని పట్టణంలోని యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో బిషప్ క్రాంతిపాల్ ఆర్థిక సాయంతో కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిషప్ క్రాంతిపాల్ లాంటి వారిని స్ఫూర్తిగా తీసుకుని అందరు సేవా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పాస్టర్స్ సేవలను గుర్తించి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి నెలా ఆర్థిక సాయం అందిస్తున్నారని తెలిపారు. బిషప్ క్రాంతిపాల్ మాట్లాడుతూ మహిళలకు ఆర్థిక భరోసా కల్పించాలనే కుట్టు మిషన్లు అందించామన్నారు. కార్యక్రమంలో ధర్మదాస్, పాల్‌బాబు, కేపీడీఆర్ ప్రసాద్, రెవ సీహెచ్ ప్రకాష్, బి.యేసురత్నం పాల్గొన్నారు.

ఆర్టీసీ కాంప్లెక్స్‌లో వసతుల పరిశీలన
అంతకు ముందు రత్నాకర్ పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌ను పరిశీలించారు. ప్రయాణికుల వసతులు, మరుగుదొడ్లు, తాగునీటి సరఫరాను పరిశీలించి, మెరుగుపరచాల్సిందిగా సూచించారు. విద్యార్థులకు సిటీ బస్సు పాస్‌ల సమస్య, కాంప్లెక్స్ లోపలికి రాకుండా, హైవే మీదుగా వెళ్లిపోతున్న బస్సులపై ఉన్నతాధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు కొణతాల భాస్కర్, మళ్ల రమణబాబు, విల్లూరి రాజేష్, కటారి దేముడు ఉన్నారు.



మహిళలకు కుట్టు మిషన్లు అందిస్తున్న దాడి రత్నాకర్, బిషప్ క్రాంతిపాల్

వైఎస్సార్ బీమా సాయం అందజేత

అనకాపల్లిటౌన్: స్థానిక 82వ వార్డు అంజయ్యకాలనీకి చెందిన శీలంశెట్టి వెంకటరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈయన వైఎస్సార్ బీమా లబ్ధిదారు. దీంతో మృతుని భార్య శోభారాణి(నామినీ)కి బీమా తక్షణ పరిహారం కింద రూ.10 వేల నగదును వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు సోమవారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిగిలిన బీమా పరిహారాన్ని త్వరలోనే అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో 83వ వార్డు ఇన్‌చార్జి జాజుల రమేష్, పార్టీ నాయకుడు అలుమల్ల జయరామ్, సచివాలయ కార్యదర్శులు గాడి శ్రీను, చవితిని సతీష్, సన్యాసిరావు, వలంటీర్ భవానీ పాల్గొన్నారు.



శోభారాణికి బీమా నగదు అందిస్తున్న జానకీరామరాజు

బాల్య వివాహాల నియంత్రణకు ప్రతిజ్ఞ



ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలు

కశింకోట: బాల్య వివాహాల నిర్మూలనకు కట్టుబడి ఉంటామని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ, సెర్ప్ సంస్థల మహిళలు ప్రమాణం చేశారు. స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో సంస్థ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాల నియంత్రణలో తమ ఆడ పిల్లలకు 18 ఏళ్లు, మగ పిల్లలకు 21 ఏళ్లు నిండక ముందు వివాహం చేయబోమని ప్రతిజ్ఞ చేశారు.బాల్య వివాహ రహిత ఏపీ, భారత్ కోసం తమ వంతు కృషి చేస్తామన్నారు. మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు వేపాడ లక్ష్మి, ఏపీఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి శ్రీకారం

కశింకోట: మండలంలోని జమాదులపాలెంలో రైతుల పొలాలకు వెళ్లేందుకు వీలుగా గ్రావెల్ రోడ్డు నిర్మాణ పనులకు విశాఖ డెయిరీ డైరెక్టర్ మలసాల రమణారావు సోమవారం భూమిపూజ చేశారు. డెయిరీ మంజూరు చేసిన సుమారు రూ.6.30 లక్షల నిధులతో ఈ రోడ్డు పనులను చేపడుతున్నారు. డెయిరీ సహకారానికి రైతులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ కలగా లక్ష్మి, ఆర్‌ఈసీఎస్ మాజీ ఉపాధ్యక్షుడు గొల్లవిల్లి శ్రీనివాసరావు, సచివాలయ కన్వీనర్ గున్నయ్యనాయుడు, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు కరక సోమునాయుడు, సర్పంచ్ కరక రాజ్యలక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల ప్రధాన కార్యదర్శి కరక శేషు, పాల సంఘం అధ్యక్షుడు పరవాడ రాము, ఎంపీటీసీ సభ్యురాలు గూడెపు లక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకుడు గూడెపు రాజు, నాయకులు వరహాలమ్మ, కరక రాజు, ఒమ్మి గంగునాయుడు, ఆంద్ర నరసింగరావు, గూడెపు అప్పారావు పాల్గొన్నారు.



జమాదులపాలెంలో గ్రావెల్ రోడ్డు నిర్మాణ పనులు

జోరుగా మేకలు, గొర్రెల విక్రయాలు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం వారపు సంతలో సోమవారం గొర్రెలు, మేకల అమ్మకాలు ఎక్కువగా జరిగాయి. దసరా ముందు వచ్చే చివరి సంత కావడంతో ఉమ్మడి విశాఖ జిల్లాతోపాటు తూర్పు గోదావరి జిల్లా నుంచి గొర్రెలు, మేకల పెంపకందార్లు, వ్యాపారులు జీవాలను అధిక సంఖ్యలో సంతకు తీసుకొచ్చారు. స్థానిక వ్యాపారులు, కబేళా నిర్వాహకులతోపాటు, దసరా పండగ సందర్భంగా పెద్ద కుటుంబాలున్నవారు కూడా మేకల్ని, గొరెరల్ని కొనుగోలు చేసుకుని, వెంట తీసుకెళ్లారు. సైజ్‌ను బట్టి ఒక్కొక్కటి రూ.5 వేల నుంచి రూ.30 వేల వరకు ధర పలికింది.

జగనన్న ఆరోగ్య సురక్షతో ఇంటింటికీ వైద్యం



రోగికి మందులు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు



యూపీహెచ్‌సీలో రోగికి కంటి పరీక్ష చేస్తున్న వైద్యుడు



యూపీహెచ్‌సీలో చిన్నారిని పరీక్షిస్తున్న వైద్యురాలు



సీహెచ్‌ఎన్ అగ్రహారంలో బాల్యవివాహాలపై ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీపీ సూరిబాబు



తేగాడ శిబిరంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శనను తిలకిస్తున్న ఎంపీపీ కలగా లక్ష్మి

అనకాపల్లిటౌన్: దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టని విధంగా వైద్య రంగంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, ఎంపీపీ గొర్లి సూరిబాబు, పార్టీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్‌లు అన్నారు. స్థానిక 83వ వార్డు గొల్లవీధి సచివాలయం-9 పరిధిలోని యూపీహెచ్‌సీలోను, మండలంలోని సీహెచ్‌ఎస్ అగ్రహారం జెడ్పీ హైస్కూల్ ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి వ్యక్తి ఆరోగ్యంగా జీవించాలనే సంకల్పంతో సీఎం జగన్ ఈ బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. మండలంలోని 26 సచివాలయాల పరిధిలో విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, ఫ్యామిలీ డాక్టర్ తోపాటు గ్రామ స్థాయిలో ప్రజలకు మరింత మెరుగైన వైద్యం అందించేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ప్రజల కోసం ఇంతగా తపిస్తోన్న జగన్‌మోహన్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లో మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాల్సిందిగా కోరారు.

అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని వైద్యపరీక్షలు చేయించుకున్నారు. కంటి వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్లద్దాలు, శస్త్రచికిత్సలకు సిఫార్సు చేశారు. గర్భిణుల కోసం అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శన ఆకట్టుకుంది. సీహెచ్‌ఎస్ అగ్రహారంలో బాల్య వివాహాల నిర్మూలన దినోత్సవంలో భాగంగా ఎంపీపీ గొర్లి సూరిబాబు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ సుర వెంకటరమణ, ఎంపీడీవో కె.నరసింహరావు, 84వ వార్డు ఇన్‌చార్జి కోరుకొండ రాఘవ, డిప్యూటీ డీఎంహెచ్‌వో జ్యోతి, సర్పంచ్ కొల్లి మల్ల గోవిందరావు, ఎంపీటీసీ కోరుకొండ అచ్చియ్యమ్మ, పార్టీ నాయకులు బంటు శ్రీనివాసరావు, అందే నాగేశ్వరరావు, సేనాపతి సాయికుమార్, వీరబాబు, సచివాలయం ఉద్యోగులు, వైద్యసిబ్బంది, ఆశావర్కర్స్, వలంటీర్లు పాల్గొన్నారు.



దివ్యాంగునికి వైద్య సేవలందిస్తున్న డాక్టర్ గ్రేస్ కేథరిన్

కశింకోట: మండలంలోని తేగాడ సచివాలయంలో సోమవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి జనాలు పోటెత్తారు. తేగాడతోపాటు సచివాలయ పరిధిలోని పేరంటాలపాలెం, జోగారావుపేట గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలి వచ్చి, వైద్య సేవలు పొందారు. స్థానిక ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో నిర్వహించిన శిబిరాన్ని ఎంపీడీవో వి.వి.రవికుమార్ ప్రారంభించారు. అనంతరం బాల్య వివాహాల నిర్మూలనపై మండల ప్రత్యేక అధికారి రోజారాణి పోస్టర్లను ఆవిష్కరించారు. ప్రత్యేక వైద్యులు డాక్టర్ గ్రేస్ కేథరిన్, పీహెచ్‌సీ వైద్యులు యు.రమేష్, ఎస్.తిరుపతిరావు రోగులను పరీక్షించి అవసరమైన మందులు అందించారు. ఆప్తాలమిక్ అధికారి పవన్ కల్యాణ్ కంటి పరీక్షలు జరిపారు. అవసరమైన వారిని కళ్లద్దాలు, ఆపరేషన్లకు సిఫార్స్ చేశారు. నడవలేని, పక్షవాత రోగులు, దివ్యాంగుల వద్దకే వైద్యులు వెళ్లి, వైద్యం అందించారు. శిబిరాన్ని జిల్లా ప్రోగ్రాం అధికారి జగదీష్ పర్యవేక్షించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార శిబిరాన్ని ఎంపీపీ కలగా లక్ష్మి, వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి పరిశీలించారు. ఎంపీటీసీ సభ్యురాలు మంగతాయారు, వైఎస్సార్ సీపీ నాయకుడు నీటిపల్లి దివాకర్, పేరంటాలపాలెం ఉప సర్పంచ్ వజ్రం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



బాల్య వివాహాల నిర్మూలన పోస్టర్ ఆవిష్కరణలో మండల ప్రత్యేక అధికారి రోజారాణి, సిబ్బంది